# ప్రణవ పద్మాకరం

ఫిబ్రవరి 26



ఆంజనేయం మహావీరం బ్రహ్మవిష్ణుశివాత్మకమ్ |
తరుణార్కప్రభం శాంతం రామదూతం భజామ్యహమ్ ||

# ఫిబ్రవరి, 2026



ఫిబ్రవరి , 2026

## విషయ సూచిక

సంపుటి-5
సంచిక-2

| | | |
|---|---|---|
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 02 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 03 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నడుముక్కల శ్రీకరి |
| 04 | శ్రీ మత్స్యమహాపురాణం | మద్దూరి వేంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ |
| 05 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 06 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 07 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 08 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |



శ్రీ మహాగణాధిపతయే నమః    శ్రీ గురుభ్యోనమః    శ్రీ మాత్రే నమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

https://srivaddipartipadmakar.org

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.

**శ్రీ గురుభ్యోనమః**

# సంపాదకీయం

## హరిహరులను అర్చించాలి



"శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః" అని పురాణం చెప్పుచున్నది. శివుని హృదయమే విష్ణువు, విష్ణువు హృదయమే శివుడు అని దీని అర్థం. అనగా, శివునికి, కేశవునికి ఏ భేదము లేదు. ఇద్దరూ ఒకరే. అట్టి శివకేశవులను అర్చించి తరించడానికి ఈ 2026 ఫిబ్రవరి మాసం ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ మాసంలో మాఘమాసం, ఫాల్గునమాసం రెండూ కలిసి ఉన్నాయి. మాఘమాసంలో నిత్యం శ్రీమన్నారాయణుని పూజిస్తూ, నదీస్నానం చేస్తే, సకలపాపాలు తొలగి, ఉత్తమలోకాలు కలిగి, మాటవరుసకైనా నరకప్రాప్తి కలుగదని పద్మపురాణంలో చెప్పబడింది. ఫిబ్రవరి 1వ తేదిన పరమపవిత్రమైన మాఘపూర్ణిమ నాడు గంగాస్నానం చేసి, అవకాశం లేని వారు ఇంటిలోనే గంగాస్మరణతో పవిత్రస్నాం చేసి, సత్యనారాయణ స్వామి వ్రతం చేసిన భక్తులు తప్పక తరిస్తారు. ఫిబ్రవరి 5వ తేదీ సంకష్టహర చతుర్థి నాడు ప్రాతఃకాల ఆరాధనం, గణపతి అర్చన, పుణ్యాన్ని కలిగిస్తాయి. అదేవిధంగా, ఫిబ్రవరి 13న విజయైకాదశి వేళ ఉపవాస వ్రతం, విష్ణుసహస్రనామ పారాయణ శుభఫలితాలను చేకూరుస్తాయి. ఇక, పరమశివుడు అగ్నిస్తంభ రూపంలో అర్ధరాత్రి వేళ ఆవిర్భవించిన మహాశివరాత్రి పర్వదినంలో శివస్మరణ, గురుస్మరణ, పంచాక్షరీమంత్ర జపం, గురువుగారు ఉపదేశించిన మంత్రజపం, బిల్వపత్రార్చన, శివసహస్రనామస్తోత్ర పారాయణం - ఇవన్నీ అధిక పుణ్యఫలాన్ని కలిగిస్తాయి. భక్తుల సౌలభ్యం కొరకు నేను స్వయంగా గానం చేసిన శివసహస్రనామం యూట్యూబ్ ఛానల్ ద్వారా విని, పారాయణం చేసుకోవచ్చు. అదేవిధంగా, జనవరి 30, 31, ఫిబ్రవరి 1 తేదీలలో శ్రీప్రణవపీఠం 13వ వార్షికోత్సవాలు జరుగనున్న సందర్భంగా భక్తులందరూ పీఠం నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాలుపంచుకొని, స్వర్ణకవచంతో అలంకరింపడిన శ్రీలలితాపరమేశ్వరీదేవిని దర్శించి, గురుకటాక్షాన్ని హరికటాక్షాన్ని పొందగలరు. సకలకార్యసిద్ధికి, శివకేశవుల అపారకరుణను పొందడానికి ఈ మాసం అత్యంత ప్రధానమైనది. అందుకే, "శ్లో|| యథా శివమయో విష్ణుః ఏవం విష్ణుమయః శివః | యథాంతరం న పశ్యామి తథా మే స్వస్తిరాయుషీ ||" అని పెద్దలు చెప్పారు. శివకేశవుల మధ్య భేదం చూడని వానికి శుభము, ఆయుష్షు పెరుగుతుంది. గురువుగారి రూపంలో శివకేశవులను చూస్తూ, ఆరాధించే భక్తులకు సకలశుభాలు కలుగుతాయి. ఈ కాలంలో గురుస్మరణ, హరిహరుల స్మరణ, గురుదర్శనం చేసుకొని, పరోపకారంతో భక్తులందరూ ఈ పవిత్రకాలాన్ని సద్వినియోగం చేసుకోగలరని మంగళాశాసనం చేస్తున్నాము.

వద్దిపర్తి పద్మాకర్

# శ్రీ గణేశ పురాణం

శ్రీ ఆదిపరాశక్తి మహిమ వలననే శ్రీకృష్ణుడంతటి పరమాత్ముడు శక్తిని పొందుతున్నాడు. ఆ శక్తి అనుగ్రహం లేనినాడు బ్రహ్మ సృష్టించలేడు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు ఈ దుర్గయే మూలశక్తి.

శ్లోII సురసంఘేఽసురగ్రస్తే, కాలే ఘోరతరే ద్విజ!
తేజస్సు సర్వదేవానాం ఆవిర్భూతా పురా సతీII

(బ్ర.వై.పు.,అ .45, శ్లో. ౭)

పూర్వం రాక్షసుల వల్ల దేవతలు కష్టాలపాలయ్యారు. అది ఒక దుష్కాలం. ఏనాడూ ఎండముఖం చూసి ఎరగని ఇంద్రుని భార్య కీకారణ్యాలలో తలదాచుకోవలసి వచ్చింది. దేవతలు కాందిశీకులై మారువేషాలలో తలొకచోట దాక్కున్నారు. ఆ సమయంలో లోకరక్షణ కోసం అమ్మవారు దేవతలందరి తేజస్సులను ఒక చోటకి చేర్చి అందులో నుండి ఆవిర్భవించింది. అప్పుడా తల్లిని లోకాలు 'దుర్గ', 'భద్రకాళి', 'విజయ', 'వైష్ణవి', 'చండిక', 'నారాయణి','ఈశాన' 'అంబిక', 'మాధవి', 'కన్యక', 'శారద','కృష్ణ','మాయ' మున్నగు నామాలతో స్తుతించారు. అలా ఆవిర్భవించిన జగన్మాత కృష్ణుని ఆజ్ఞతో మహిషాసురాది రాక్షసులను సంహరించింది. దేవతలకు తిరిగి వారి రాజ్యాలను ప్రసాదించింది. ఎప్పటికప్పుడు లోక రక్షణ కోసం అనేక రూపాలు ధరిస్తూ ఉంటుంది. ఒకప్పుడు దక్ష ప్రజాపతి అమ్మవారిని తన తపస్సుతో, పూజలతో మెప్పించగా అమ్మవారు ప్రత్యక్షమైంది. అప్పుడు దక్ష ప్రజాపతి ఆమెను తన కుమార్తెగా జన్మించమని ప్రార్థించాడు. అప్పుడు అమ్మవారు అతనికి వరమిచ్చి, 'సతి' అనే పేరుతో అతనికి కుమార్తెగా పుట్టింది. శివుని చేపట్టింది. ఈ అవతారంలో ఉన్న ఆమె శివునిపత్నియే. దుష్కర్మ యోగం వలన దక్షుడు శంకరునితో విరోధించాడు. సకల లోక శుభంకరుడు, దుష్టమదాసురేంద్రనాశంకరుడు అయిన శంకరుని తూలనాడి తీవ్రంగా ద్వేషించి అరుద్రయాగం చేసాడు. ఆ యాగానికి వెళ్లి అవమానంపాలై తన శరీరాన్ని విడిచిపెట్టింది. అనంతరం హిమవంతునికి పుత్రికగా పుట్టింది. పర్వతపుత్రిక గనుక పార్వతి అనబడింది. శివుడు తన భర్త కావాలని కోరి కేదారేశ్వర ప్రాంతంలో మహాతపస్సు చేసింది. శంకరపత్ని అయ్యింది. ఈ జగన్మాత చేసిన మహాతపఃఫలితంగా శ్రీ కృష్ణారాధన ప్రభావం వలన శ్రీకృష్ణాంశస్వరూపుడైన గణపతి ఆమెకు పుత్రుడుగా జన్మించాడు. నాయనా! పరశురామా! నీవు శ్రీకృష్ణుడి అంశతో జన్మించిన వాడివి. నిత్యం శ్రీకృష్ణధ్యానం చేసి భక్తిని చాటుకుంటున్న వాడివే, అయినా మోహం వల్ల శ్రీకృష్ణాంశస్వరూపుడైన గణపతిని గ్రహించలేకపోతున్నావు. ఈ పార్వతీపుత్రుడు సకల దేవతాస్వరూపుడు. ఈతనికి విష్ణువునకు భేదం లేదు. గణపతిని ఒక్కడిని సక్రమంగా అర్చిస్తే సృష్టిలోని సకల దేవతలనూ పూజించినట్లే. ప్రకృతిని పూజించినట్లే. ఆయనను తిరస్కరిస్తే అందరిని తిరస్కరించినట్లే. ఒక దూర్వాదళ పూజనంతో సంతృప్తి పొందే పరమాత్ముడు గణపతి. ఇంత తేలికగా భక్తులననుగ్రహించే దైవం మరొకడు లేడు. గణపతిని విరోధించినవాడు, శివునికి మాత్రం ప్రీతిపాత్రుడు ఎలా అవుతాడు. అందువల్ల మనఃస్ఫూర్తిగా గణేశుని పూజించి ప్రసన్నం చేసుకో. నారాయణుని మాటలు అంగీకరించాడు రాముడు.


.. ఇంకా ఉంది



# శ్రీ వేంకటేశ్వర రహస్యము

ఒకానొక కాలంలో వసిష్ఠుడు, బ్రహ్మర్షులు, దేవర్షులు, సాధువులు, జ్ఞానులు అయిన కొందరిని వెంటబెట్టుకొని బ్రహ్మలోకానికి వెళ్ళాడు. ఆ సమయంలో లోకశ్రేయస్సు కోసం బ్రహ్మ ఒక అద్భుతమైన సభను ఏర్పాటు చేసాడు. తెల్ల తామరపూవుపై బ్రహ్మదేవుడు కూర్చుని ఉన్నాడు. ఆయనకు ఎదురుగా సువర్ణమణిమయాసనాలపై దేవతలు, మనువులు, పరమపుణ్యాత్ములైన మహాచక్రవర్తులు, యోగులు, సిద్ధులు, సనకసనందనసనత్కుమార సనత్సుజాతులు, నారదుడు, తుంబురుడు కూర్చుని ఉన్నారు. వేదాలు, పురాణాలు, శాస్త్రాలు రూపాలు ధరించి బ్రహ్మను భక్తితో సేవిస్తున్నాయి. గంగ, యమున, సరస్వతి, గోదావరి, కృష్ణ వంటి నదీనదాలు, పుణ్యతీర్థాలు, సముద్రాలు రూపాలు ధరించి ఒక ప్రక్క కూర్చుని ఉన్నాయి. పర్వతాలు, వృక్షదేవతలు మూర్తులు ధరించి ఆ సభలో దర్శనం ఇస్తున్నాయి. అది అరుదైన బ్రహ్మ సభ. గాయత్రీ సావిత్రీ సరస్వతీ దేవతలు కూడా బ్రహ్మకు ఇరువైపులా ఉన్నారు. సభ సాగుతుండగా బ్రహ్మ అనుమతితో బ్రహ్మ మానస పుత్రుడైన వసిష్ఠుడు ఆయనకు నమస్కరించి ఆయనతో ఇలా అన్నాడు — బ్రహ్మదేవా! సేవిత సకలజీవా! శుభభాగ్యవిధాతా! నతజనత్రాతా! పాహిమాం. నీ అనుగ్రహం ఉంటే అణువు పర్వతం అవుతుంది. పర్వతం అణువు అవుతుంది. నన్ను దయచూడు. నా మనస్సులో చాలాకాలం నుండి ఒక చింత ఉంది. అది క్రమంగా నన్ను పట్టి పీడిస్తోంది. అది నీవే తొలగించాలి. బ్రహ్మ చిఱునవ్వుతో వసిష్ఠుని దీవించి ఇలా అన్నాడు — బ్రహ్మ పుత్రుడివి. వైవస్వతమను వంశం వారికి కులపురోహితుడివి. విశ్వామిత్రుని శక్తులన్నీ కేవలం బ్రహ్మదండంతో ధ్వంసం చేసిన వాడివి. శ్రీరామచంద్రుని గురుడవు. అటువంటి నీకు మనశ్చింత ఎలా ఏర్పడింది. జ్వరానికి మందున్నది. చింతా జ్వరానికి ఔషధం లేదు. చింతవల్ల ప్రయోజనం లేదు గాని సర్వశక్తులు చింత వల్ల నశిస్తాయి. కనుక నిశ్చింతుడవు కావాలి. నీ మనస్సులోని బాధ ఏమిటో చెప్పు. తప్పక నీ బాధను నివారిస్తాను.


.....ఇంకా ఉంది



# శ్రీ మత్స్యమహాపురాణం

మత్స్యరూపుడైన శ్రీమహావిష్ణువు మనువుతో ఇలా అన్నాడు - "మనువా! నా ప్రభావంచేత, దేవతలు నశించినా నీవు మాత్రం మిగిలి ఉంటావు. ఈ అవాంతర ప్రళయ కాలాన సూర్యచంద్రులు, నేను (శ్రీమహావిష్ణువు), బ్రహ్మ, స్వర్గ మర్త్య పాతాళ బ్రహ్మ లోకాలు (నాలుగు లోకాలు), పవిత్రమైన నర్మదానది, మార్కండేయ మహర్షి, శివుడు, వేదాలు, పురాణాలు, ఇతర విద్యలు, నీవు (మనువు) ఇవన్నీ నిలిచి ఉంటాయి. ఈ విధంగా చాక్షుష మన్వంతరం తరువాత అవాంతర ప్రళయంతో ఒకే సముద్రం (సప్త సముద్రాలు కలిసి) కాగా, ఈ సృష్టి ఆరంభంలో భూమండలంపై నేను వేదాలను ప్రవర్తిల్లజేస్తాను". ఈ విధంగా పలికి భగవానుడు అక్కడనే అంతర్ధానమయ్యాడు.ఇక మనువు కూడా, ఇంతకు ముందే భగవానుడు చెప్పినట్లు ప్రాణి ప్రళయం వరకు తనకు వాసుదేవుని అనుగ్రహం వల్ల కలిగిన యోగాన్ని మరల మరల అనుష్ఠిస్తూ ఉండిపోయాడు. శ్రీమహావిష్ణువు తాను అంతకు ముందే చెప్పిన సమయానికి ఒక పెద్ద కొమ్ము కలిగిన మత్స్య రూపం ధరించి వచ్చాడు. ఆదిశేషుడు త్రాడు రూపంలో మనువు దగ్గరకు వచ్చాడు. వెంటనే మనువు సర్వ భూతాలను లాగి, దగ్గరకు తీసికొని, సర్పపు త్రాటితో చేసిన కొమ్ముకు నావను కలిపి కట్టాడు. అత్యంత భక్తితో మత్స్యరూపుడైన శ్రీమన్నారాయణునికి నమస్కరించి, చేప కొమ్ము దగ్గరగా నిలబడ్డాడు. ఆ అవాంతర ప్రళయం గడిచిన తరువాత మత్స్యరూపంలో ఉన్న శ్రీమన్నారాయణుని ప్రార్థించగా, భగవానుడు మనువుకు పురాణాన్ని ప్రవచించాడు.సూత మహర్షి ఇంకా ఇలా అన్నాడు - "ఓ ఋషులారా! ఆ భగవానుడు మనువుకు చెప్పిన పురాణాన్ని ఇప్పుడు నేను మీకు వివరిస్తాను, శ్రద్ధగా వినండి. ఇంతకు ముందు మీరు నన్ను సృష్టి మొదలగు వాటిని గురించి అడిగిన విషయాలనే - ఏకార్ణవాన ఉన్న మనువు కేశవుని ఏ విధంగా ప్రశ్నించాడు. "శ్రీమన్నారాయణా! ప్రపంచోత్పత్తిని, ప్రళయాన్ని, వంశాన్ని, మన్వంతరాలను, వంశాను చరిత్రల్ని, భువన విస్తారాన్ని, వివిధములైన దాన ధర్మాలను, శాశ్వతమైన శ్రాద్ధ కల్పాల్ని, వర్ణాశ్రమ విభాగాల్ని, ఇష్టాపూర్తాలనే సత్కర్మలు, దేవతా ప్రతిష్ఠలను గూర్చి తెలియజేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను!" అప్పుడు మత్స్యరూపంలో ఉన్న శ్రీమహావిష్ణువు మనువుతో ఇలా అన్నాడు - (ఈ జరిగినది అవాంతర ప్రళయం. కానీ ఈ కల్పాదికి ముందు), మహాప్రళయం జరిగిన సమయంలో ఇదంతా చీకటితో నిండిపోయింది. స్థిర చర రూపమైన ప్రపంచమంతా గాఢ నిద్రలో మునిగిందా అన్నట్లుంది. తర్క ప్రమాణంతో ఎరుగరానిదిగా, అనుభూతితో గుర్తింపరానిదిగా, దాని లక్షణం మరి ఏమని నిశ్చయించి చెప్పడానికి వీలుకానిదిగా, అనుభవంతో తెలియనిదిగా ఇంద్రియాలకు అగోచరంగా ఉండిపోయింది. అప్పుడు నామరూపాలతో వ్యక్తం కానివాడు, యజ్ఞాదిపుణ్యకర్మలకు కారణమైనవాడు స్వయంభూపరమేశ్వరుడు తన ఆ స్వభావాన్నీ వ్యక్తం చేస్తూ, ఆ చీకట్లను పోగొడుతూ సాక్షాత్కరించాడు. ఈ ఇంద్రియాలకు గోచరం కానివాడునూ, ఈ అవ్యక్తం కంటే శ్రేష్ఠుడునూ, సమస్త భూతములందుండి వాటి చిత్త వృత్తులను తన అదుపులో ఉంచుకున్న వాడునూ, సనాతనుడునూ, నారాయణుడని ప్రసిద్ధి గాంచినవాడునూ అగు ఆ పరమాత్మయే స్వయంగా ఉద్భవించాడు.

....ఇంకా ఉంది



# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః   శ్రీ మాత్రేనమః   శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 351 . వామకేశీ (ఓం ఐం హ్రీం శ్రీం వామకేశ్యై నమః)



'వామక' శబ్దానికి ఎడమ, విపరీతము, వ్యతిరేకము అనే అర్థాలున్నాయి. అకారాంత పుంలింగ శబ్దానికి 'జంతువు', ప్రాణి, అనే అర్థాలున్నాయి. వామః లేక వామకః అనగా ప్రాణి. సర్వప్రాణులకూ అధిపతి ఈశ్వరుడు. అందువల్ల వామకేశుడు అనగా సర్వజీవాధిపతి. ఆయన పత్ని కనుక అమ్మవారికి వామకేశి అని పేరు. శివుని వామ భాగంలో ఉండునది అని కూడా మరొక అర్థం చెప్పుకోవచ్చును. చక్కని, అందమైన జుట్టు కలది అని కూడా మరొక అర్థం. శివ తీర్థాలు అరవై ఎనిమిది ఉన్నాయనీ, వాటిలో 'జటా' అనబడే తీర్థంలో వామకేశ్వరుడు అనే పేరుతో శివుడు ఉన్నాడనీ దేవీభాగవతం చెబుతోంది. ఆయన సతీమణికి వామకేశి అని పేరు. వామకేశ్వర తంత్రంలో శివపార్వతీ సంవాదంలో 'వామకేశి' అనబడే దేవీ ప్రస్తావన ఉంటుంది

### మంత్ర ప్రయోగం – ఫలితం

ఈ మంత్రమును నిత్యం 11 సార్లు జపించడం మంచిది. సరియైన నిర్ణయం తీసుకోలేక తన జీవితాన్ని, ధనాన్ని పాడుచేసుకునే వ్యక్తికోసం అగస్త్యుడు ఒక చక్కని విధానం చెప్పాడు. చేతిలో చిటికెడు విభూతి పట్టుకొని రోజుకి 108 సార్లు చొప్పున ఈ మంత్రాన్ని 41 రోజులు జపించాలి. జపం అయ్యాక ఆ విభూతి నుదుట ధరించాలి. జీవితాన్ని ఎలా నడిపించుకోవాలో, ఏ నిర్ణయం జీవితాన్ని ఆనందమయం చేస్తుందో, జపం చేసేవారికి స్ఫురిస్తుంది. విద్యార్థులు ముఖ్యంగా ఈ మంత్రం జపం చేస్తే తమ జీవితాన్ని తామే నిర్దేశించుకోగలరు.


... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

# ఋషి చరిత్ర

## దుర్వాస మహర్షి

భారతీయ పురాణ సాహిత్యంలో దుర్వాస మహర్షి ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న మహానుభావుడు. సాధారణంగా ఆయనను కోపానికి ప్రతీకగా చిత్రీకరిస్తారు. అయితే ఆ కోపం వెనుక దాగి ఉన్న ధర్మబద్ధత, లోకహిత భావన, భక్తి పరిరక్షణ అనే లోతైన తాత్పర్యాన్ని గ్రహించినప్పుడే దుర్వాస మహర్షి యొక్క నిజమైన మహిమ మనకు అవగతమవుతుంది.దుర్వాస మహర్షి అత్రి మహర్షి మరియు అనసూయాదేవిల కుమారుడు. అత్రి—అనసూయ దంపతులు తమ తపోబలంతో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను సాక్షాత్కరింపజేసిన మహానుభావులు. అటువంటి మహాత్ముల సంతానంగా జన్మించిన దుర్వాసుడు బాల్యంనుండే తీవ్రమైన తపస్సు, బ్రహ్మచర్యం, ఇంద్రియ నియంత్రణతో విశిష్టుడయ్యాడు. ఆయనలోని తపోబలం అంతటి గొప్పది గనుక దేవతలే ఆయన కోపానికి భయపడేవారు. పురాణాలలో దుర్వాస మహర్షి కోపానికి మారుపేరుగా వర్ణించబడతాడు. అయితే ఆయన కోపం అహంకార జనితం కాదు; అది ధర్మ విరుద్ధ ప్రవర్తనపై ఉద్భవించిన ఆగ్రహం. ధర్మాన్ని ఉల్లంఘించిన రాజులైనా, దేవతలైనా ఆయనకు ఒకటే. అందుకే దుర్వాసుని శాపాలు వ్యక్తిగత ప్రతీకారం కోసం కాకుండా, లోక క్రమాన్ని సరిదిద్దడానికి ఉపకరించాయి. దుర్వాస మహర్షికి సంబంధించిన అత్యంత ప్రసిద్ధ కథల్లో ఒకటి ఇంద్ర శాప కథ. ఒకసారి దుర్వాసుడు ఇంద్రునికి ఇచ్చిన పుష్పమాలను ఇంద్రుడు అహంకారంతో తన ఐరావతం తలపై వేసాడు. ఆ మాలను ఐరావతం నేలపై పడేసింది. ఈ అవమానాన్ని భరించలేక దుర్వాసుడు ఇంద్రునికి శాపం ఇచ్చాడు. దాని ఫలితంగా దేవతలు తమ శక్తి, వైభవాలను కోల్పోయారు. ఈ సంఘటన చివరికి సముద్ర మథనం అనే మహత్తర ఘట్టానికి దారితీసింది. అమృతావతరణం, లక్ష్మీదేవి ఆవిర్భావం వంటి మహత్తర సంఘటనలు ఈ శాపం వల్లనే సంభవించాయి. ఇక్కడ దుర్వాసుని శాపం ఒక విధ్వంసానికి కాదు, లోకానికి మేలు చేకూర్చిన మహా పరిణామానికి కారణమైంది.

.ఇంకాఉంది



## దివోదాసుని వృత్తాంతం

శివుడు ఢుంఢి గణపతిని స్తోత్రము చేసెను . ఆ స్తోత్రమును మనుషులు చేస్తే కలుగు శుభములను వివరించెను. ఆ తర్వాత కాశీ యందు 56 రూపములతో ఏడు ఆవరణలలో కొలువుదీరిన వినాయకుడిని ,ఆయన రూపములను దర్శించడం వల్ల కలుగు ఫలితములను వివరించెను

| ఆవరణ | గణపతి నామము | దర్శనము వలన కలుగు ఫలితం |
|---|---|---|
| నాలుగవ | అభయప్రద వినాయకుడు | భయములు తొలగును |
| నాలుగవ | సింహతుండ వినాయకుడు | విఘ్నములు నశిస్తాయి |
| నాలుగవ | కూణితాక్ష వినాయకుడు | దుష్టుల వక్ర దృష్టి తొలగుతుంది |
| నాలుగవ | క్షిప్రప్రసాద వినాయకుడు | సర్వ సిద్ధులు కలుగును |
| నాలుగవ | చింతామణి వినాయకుడు | భక్తుల కోరికలు తీరును |
| నాలుగవ | దంతహస్త వినాయకుడు | కాశీ విరోధకులకు విఘ్నములు కలుగును |
| నాలుగవ | పిచండిల వినాయకుడు | కాశీ ని రక్షించును |
| నాలుగవ | ఉద్దండముండ వినాయకుడు | కోరికలు తీర్చును,భక్తుల రక్షకుడు |



కాశీ లో నాలుగవ ఆవరణ నుండి భక్తులకు సర్వసిద్ధులను అనుగ్రహించి శుభములను కలుగజేస్తూ భక్తులను కాశీలో అనుగ్రహిస్తూ ఉన్నారు గణపతి. గణపతి స్వామి దుష్టులను, అభక్తులను దుర్మార్గులను కాశీ నుండి బయటకు పంపివేయును

..ఇంకాఉంది

## శ్రీ మయూరేశ్వర స్తోత్రమ్

పరబ్రహ్మరూపం చిదానందరూపం పరేశం సురేశం గుణాబ్ధిం గణేశం ।

గుణాతీతమీశం మయూరేశవంద్యం గణేశం నతాః స్మో నతాః స్మోనతా స్మః ॥1॥

జగద్వంద్యమేకం పరాకారమేకం గుణానాం పరం కారణం నిర్వికల్పం ।

జగత్పాలకం హారకం తారకం తం మయూరేశవంద్యం నతాస్మోనతాఃస్మ ॥2॥

మహాదేవసూనం మహాదైత్యనాశం మహాపురుషం సర్వదా విఘ్ననాశం ।

సదాభక్తపోషం పరం జ్ఞానకోశం మయూరేశవంద్యం నతాఃస్మోనతాఃస్మః ॥3॥

అనాదిం గుణాదిం సురాదిం శివాయా మహాతోషదం సర్వదా సర్వవంద్యం ।

సురార్యంతకం భుక్తిముక్తిప్రదానం మయూరేశవంద్యం నతా:స్మో నతాఃస్మః ॥4॥

పరం మాయినం మాయినామప్యగమ్యం మునిధ్యేయమాకాశకల్పం జనేశం ।

అసంఖ్యావతారం నిజాజ్ఞాననాశం మయూరేశ వంద్యంనతా:స్మో నతాస్మః ॥5॥

అనేక  క్రియాకారకం శ్రుత్యగమ్యం త్రయీబోధితానేక కర్మాది బీజం ।

క్రియాసిద్ధిహేతుంసురేంద్రాదిసేవ్యం మయూరేశపంద్యం నతాఃస్మో నతాస్మః ॥6॥